క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వసంత



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీషా దంపతులు, కుటుంబ సభ్యులు కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం సూర్యప్రభ వాహనం సేవలో తరించారు. ప్రతి సంవత్సరం వేంకటేశ్వరస్వామి సేవలో తరించడం తమ కుటుంబానికి ఆనవాయితీగా వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అయోడిన్ ఉప్పుపై అవగాన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్ వారోత్సవాలు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు వివిధ గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో అయోడిన్ ఉప్పుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని పీహెచ్‌సీ వైద్యులు మసూద్ అన్నారు. పిల్లల్లో మానసిక ఎదుగుదల, గర్భిణుల్లో బిడ్డ ఆరోగ్యానికి, థైరాయిడ్ సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పు వినియోగించాలన్నారు. అయోడిన్ ఉప్పుపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

క్షేత్ర పర్యటనతో అవగాహన

మైలవరం: క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై అవగాహన పెరుగుతుందని చరిత్ర అధ్యాపకుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు విహార యాత్రలో భాగంగా గుంటూరు జిల్లాలోని కొండవీడు కోటను శనివారం సందర్శించారు. అధ్యాపకులు శ్రీనివాసరావు కొండవీటి రాజ్య స్థాపన, రాజుల వంశ చరిత్రను, కట్టడాల విశేషాలను వివరించారు. పర్యాటక ప్రాంతంగా, అడ్వెంచర్ టూరిజంకు కొండవీడు కోట ప్రసిద్ధి చెందిందని అధ్యాపకులు తెలిపారు.

త్యాగాలు మరువలేనివి

మైలవరం: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా శ్రేయస్సే పరమావధిగా, విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టిన అమరవీరులని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి సేవలు, త్యాగాలు స్మరించుకుంటూ అమరులైన పోలీసులకు నివాళులర్పించారు.

ఎంపీపీకి మాతృవియోగం

చాట్రాయి: మండల పరిషత్ అధ్యక్షురాలు లంకా నిర్మల తల్లి లంకా చందమ్మ (80) శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, నాయకులు బాబ్జీ, వాసు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, అధికారులు, చందమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి సోదరుడు నరసింహారెడ్డి ఇటీవల ఇటీవల మృతిచెందాడు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బసవారెడ్డిని శనివారం పరామర్శించారు.

బాల్య వివాహంపై పోలీసులకు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రామికనగర్‌లో ఇటీవల జరిగిన బాల్య వివాహంపై ఐసీడీఎస్ అధికారులు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈనెల 16న శ్రామికనగర్‌కు చెందిన బాలికకు 18 ఏళ్లు నిండకుండానే మైలవరం మండలం బొర్రగూడెం ఆలయంలో వివాహం జరిగినట్లు గుర్తించిన ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.రమాదేవి, సచివాలయ మహిళా సంరక్షణ అధికారి పి.రమాదేవి మైలవరం సీడీపీఓ పుష్పలతకు తెలియజేశారు. ఆమె సూచనల మేరకు సంబంధిత వ్యక్తులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

మైలవరం: కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మైలవరం మండలం పుల్లూరు సెంటర్ సమీపంలో శనివారం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం కాస్వారానికి చెందిన ఆర్.నాగేశ్వరరావు(70) పుల్లూరు సమీపంలోని దాసుళ్లపాలెం రోడ్డు వద్ద నడుచుకుంటూ వెళుతుండగా విజయవాడ నుంచి తిరువూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ హరిప్రసాద్ కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం



ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లిలో మందుల కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బొద్దనపల్లిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దయాల ఆశా, పీహెచ్‌సీ వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు, ఎంపీడీఓ పీ శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, వైస్ ఎంపీపీ గద్దం సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యుడు విష్ణువర్ధన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఈదర సొసైటీ చైర్మన్ వేణు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

మొర్సుమల్లి(మైలవరం): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ మాడపాటి రమాదేవి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంతో ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు, నాయకుడు మాడపాటి శ్రీనివాసరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, వడ్డే రామారావు, సర్కరపు కృష్ణ పాల్గొన్నారు.



రెడ్డిగూడెం మండలం రంగాపురంలో పోషకాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

200 మందికి వైద్యపరీక్షలు

తిరువూరు: స్థానిక 17వ వార్డులోని షాదీఖానాలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఈ శిబిరంలో 200 మంది రోగులకు వైద్యసేవలందించి, మందులు అందజేశారు. రోగులకు జగనన్న మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. 16, 17 వార్డుల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు వేణుబాబు, జాకీర్, నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.



తిరువూరులో మందుల కిట్ల పంపిణీ



నూజివీడు మండలం తూర్పుదిగవల్లిలో నేత్ర పరీక్షల క్యాంప్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి



మొర్సుమల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజల ఆరోగ్యానికి రక్ష

నూజివీడు: ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్ రామమోహన్‌రావు అన్నారు. మండలంలోని తూర్పు దిగవల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రత్యేకాధికారి సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీఏ విజయకుమార్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని రంగాపురంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీడీపీఓ కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషక పదార్థాల స్టాళ్లను జెడ్పీటీసీ సభ్యుడు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, సర్పంచ్ పడిశాల సునీత, నాయకుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



గంపలగూడెం మండలం రాజవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను–2 సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులు, తిరువూరుకు చెందిన స్పెషలిస్టు వైద్యులు రోగులను పరీక్షించారు. శిబిరంలో 240 మంది వైద్యసేవలు పొందారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ పాల్గొన్నారు.

పాలనను గ్రామస్థాయికి తీసుకెళ్లిన సీఎం జగన్

> ఎమ్మెల్యే మేకావెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ పాలనను నేరుగా గ్రామస్థాయికి తీసుకెళ్లారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బొద్దనపల్లిలో నిర్మించిన గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. జలకళ పథకంలో మంజూరైన సబ్‌మెర్సిబుల్ విద్యుత్ మోటార్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎంపీడీఓ పీ శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, సొసైటీ చైర్మన్ బోయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బొద్దనపల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

యువత సన్మార్గంలో నడవాలి

మైలవరం: యువత దైవ భక్తితో సన్మార్గంలో నడవాలని ఆర్‌సీఎం మైలవరం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కే అనిల్ ఫ్రాన్సిస్ హితవు పలికారు. స్థానిక శాంతినగర్‌లోని ఆర్‌సీఎం విచారణ దేవాలయంలో యువతా దినోత్సవం శనివారం నిర్వహించారు. ప్రస్తుతం యువత చెడుదోవ పడుతోందని, ఈ దశలో దేవుని యందు విశ్వాసం, దైవ చింతన కలిగి ఉండాలన్నారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ గ్రేస్ జాన్సి, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎస్. బోస్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌సీఎం చర్చిలో యువతా దినోత్సవం

న్యాయవాదుల గుమాస్తాల సంఘ కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: తిరువూరు కోర్టుల్లో న్యాయవాదుల గుమాస్తాల సంఘానికి శనివారం కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆగిరిపల్లి బాలాజీ, కార్యదర్శిగా బొగ్గుల వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. న్యాయవాద గుమాస్తాల సంక్షేమానికి కృషిచేస్తామని బాలాజీ పేర్కొన్నారు. న్యాయవాదులు వీరిని అభినందించారు.

బతుకమ్మ సంబరాలు

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యూనియన్ ట్రస్‌బోర్డు సభ్యురాలు ముక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పాడి రైతుల చేత బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ తరఫున క్లస్టర్ మేనేజర్ టి సాంబశివమూర్తి పాల్గొన్నారు.

డీఎల్‌డీఓగా ఉద్యోగోన్నతి

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న వై పిచ్చిరెడ్డికి డీఎల్‌డీఓగా ఉద్యోగోన్నత లభించింది. 2019 జూలై నుంచి ఆయన ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్నారు. పంచాయితీరాజ్‌శాఖ కమిషనరేట్ కార్యాలయం పరిధిలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా ఆయన ఇకపై పనిచేస్తారు.

అసంఘటిత కార్మికుల పేర్లు నమోదు చేసుకోవాలి

నూజివీడు: అసంఘటిత కార్మికులందరూ సంబంధిత యూనియన్లలో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవడం ద్వారా వారి సమస్యలపై సంఘటితంగా పోరాడేందుకు, ప్రభుత్వం అమలు చేసే పథకాలను తెలుసుకునేందుకు వీలవుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని అమర భవన్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు న్యాయపరంగా సాయం కావాలంటే కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయసాయాన్ని పొందవచ్చన్నారు. నూజివీడు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్యామ్‌బాబు మాట్లాడుతూ పని ప్రదేశంలో కార్మికుడికి తగిన సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంటుందన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావు

వరి పంట పరిశీలన

ముసునూరు: వర్షాభావ పరిస్థితుల కారణంగా వాడుముఖం పట్టిన వరి పంటను వ్యవసాయాధికారి మధుమోహన్ పరిశీలించారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడులోని రాయకుంట చెరువు ఆయకట్టులోని చివరి భూములకు చెరువు నీరు అందక ఎండు దశ పట్టిన వరి పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాయకుంట చెరువు ఆయకట్టులో వర్షం లేక, సాగు నీరు అందక చివరి భూములు వాడి పోవడం ప్రారంభమైందన్నారు. ఇదే కొనసాగితే ఆయకట్టులోని 50 ఎకరాల్లో పంటకు పూర్తి నష్టం వాటిల్లే పరిస్థితి తలెత్తుందన్నారు. దీనిపై తక్షణమే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడు సుందరరావు మృతి

ముసునూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, కొర్లగుంట ఎంపీటీసీ సభ్యుడు వన్నెకూటి సుందరరావు (46) అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల అస్వస్థతకు గురి కావడంతో ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. గుండెలోని వాల్వ్‌లు మూసుకుపోవడంతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. శనివారం తీవ్ర అస్వస్థతకు గురై ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తదితరులు సుందరరావు భౌతిక కాయాకి నివాళులర్పించారు.

లలితా బాల త్రిపుర సుందరీదేవీ నమోస్తుతే




పుట్రేలలో లలితా త్రిపుర సుందరీ దేవిగా...



తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో దుర్గాదేవిగా...



బలివేలో చండీమాతగా...



మైలవరంలో లలితాదేవి అలంకారంలో...

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా సందర్భంగా అమ్మవారిని శనివారం లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ కోటగిరి సునీల్ కుమార్, ఆలయ ఈఓ సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. విస్సన్నపేట ద్వారకా నగర్‌లో ఉన్న కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రులు సందర్భంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

చండీ మాతా.. పాహిమాం

బలివే (ముసునూరు): చండీ మాతా.. కార్యసిద్ధి ప్రదాత, సర్వకాల సర్వావస్థలలో కార్యములు నెరవేర్చు తల్లీ! అంటూ దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఏడో రోజున శనివారం చండీ మాతకు భక్తులు పూజలు చేశారు. బలివేలోని ప్రసిద్ధ బలే రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని చండీ మాతగా అలంకరించారు. గోపవరం నాగేంద్రస్వామి ఆలయం, ముసునూరు, చెక్కపల్లి, వేల్పుచర్ల, రమణక్కపేట, గుడిపాడు, వలసపల్లి, చింతలవల్లి ఆలయాల్లో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

లలితాదేవి అలంకారంలో దర్శనం

మైలవరం: దేవి నవరాత్రులు పురస్కరించుకుని మైలవరం తిరువూరు రోడ్డులోని శ్రీరేణుకాదేవి సమేత పాండురంగస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని లలితా దేవిగా అలంకరించారు. అమ్మవారిని 100 డజన్ల గాజులుతో ఆలయ కమిటీ సభ్యులు అలంకరించారు. అదే విధంగా లలితాదేవికి ప్రీతికరమైన చెరుకు గడలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



నూజివీడులో లలితా త్రిపుర సుందరీదేవిగా..

చాట్రాయిలో..

చాట్రాయి: దేవీ నవరాత్రులు సందర్భంగా శనివారం కనకదుర్గ అమ్మవారు లలితాత్రిపుర సుందరీ దేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చనుబండ మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ కమిటీ మహేంద్ర మేదర సంఘం ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు.

నూజివీడులో..

నూజివీడు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో కొలువై ఉన్న కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో మహీషమ్మ శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు గుదిమళ్ల సత్యన్నారాయణాచార్యుల నేతృత్వంలో అమ్మవారికి మేలుకొలుపు, శ్రీ చక్రార్చన, అభిషేకాలు, లలితా త్రిపుర సహస్రార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

దసరా ఉత్సవాలకు ప్రజలు తరలిరావాలి

నూజివీడు: పట్టణంలో ఈనెల 23న నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని స్పోర్టింగ్ క్లబ్ చైర్మన్ రామిశెట్టి మురళీకృష్ణ కోరారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, అనేక రకాల వేషధారణలు, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నెమలిలో..

నెమలి(గంపలగూడెం): చేపట్టే పనుల్లో విజయాన్ని చేకూర్చాలంటూ విజయలక్ష్మీ దేవికి శనివారం భక్తులు నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందం రాజ్యలక్ష్మీదేవికి విజయలక్ష్మీ దేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు.

తోటమూలలో..

తోటమూల(గంపలగూడెం): దసరా వేడుకల్లో భాగంగా గంపలగూడెం మండలం తోటమూల వై–జంక్షన్ వద్ద శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా అమ్మవారికి లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారం చేశారు.

తిరువూరులో..

తిరువూరు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజు శనివారం తిరువూరులోని పలు ఆలయాల్లో అమ్మవారికి విశేషాలంకారాలు చేశారు. శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో మహిషాసుర మర్దనిగా, శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో దుర్గాదేవిగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. శ్రీ కనకదుర్గాలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో సువాసినీ పూజలు జరిగాయి.

లలితా దేవికి పూజలు

వామకుంట్ల(తిరువూరురూరల్): మండలంలోని వామకుంట్లలో శనివారం అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నవరాత్రి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలోని వివిధ గ్రామాల్లో పలు ఆలయాల్లో శరన్నవరాత్రుల వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాలు, నవరాత్రి పందిళ్లలో అమ్మవారికి లలితాత్రిపురసుందరీదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.